సాక్షి జగిత్యాల

బుధవారం। 25। డిసెంబర్। 2024



చెత్త సేకరణపై చిత్తశుద్ధి ఏది..?

జిల్లా కేంద్రంలో చెత్త సేకరణపై చిత్తశుద్ధి కరువైంది. ఇంటింటా తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలి. -10లో▸




ముదురుతున్న ఆలయ వివాదం

మెట్‌పల్లి మండలం వెల్లుల ఎల్లమ్మ తల్లి ఆలయ వివాదం మరింత ముదురుతోంది. వీడీసీ, అధికారుల మధ్య వివాదం నడుస్తోంది. -10లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 29.0/17.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.







చర్చిలు ముస్తాబు

జగిత్యాలటౌన్: క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవ మందిరాలు ముస్తాబయ్యాయి. జిల్లాకేంద్రంలోని సీఎస్ఐ వెస్లీ చర్చి, హెబ్రోన్, ఏసురక్తం, ధరూర్ క్యాంపులోని సీఎస్ఐ చర్చిలతో పాటు పలు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్ కాంతులతో అలంకరించారు. టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు.

మండలంగా అల్లీపూర్..?

- జిల్లాలో మరో కొత్త మండలం
- వేగంగా కదులుతున్న ఫైళ్లు
- అధికారిక ప్రకటనే తరువాయి



అల్లీపూర్ గ్రామపంచాయతీ

రాయికల్: జిల్లాలో మరో కొత్త మండలం ఏర్పాటు కానుంది. రాయికల్ మండలంలో మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న అల్లీపూర్‌ను మండలకేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచి సంకేతాలు అందుతున్నాయి. అల్లీపూర్‌ను మండలం చేయాలని గ్రామ జేఏసీ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక పోరాటాలు చేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కూడా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మండలం ఏర్పాటు అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రతిపాదనలు పంపాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఫైళ్లు వేగంగా కదులుతున్నాయి.

11 గ్రామాలతో మండలం..

వాస్తవానికి రాయికల్ జిల్లాలోనే పెద్ద మండలం. ఈ మండలంలో 32 గ్రామాలు ఉన్నాయి. నిర్మల్ జిల్లా సరిహద్దు వరకు విస్తరించి ఉంది. పైగా రాయికల్ పట్టణం మున్సిపాలిటీగా ఉంది. ఈ క్రమంలో అల్లీపూర్‌ను మండలంగా ఏర్పాటు చేయాలన్న అంశం తెరపైకి వచ్చింది. అల్లీపూర్‌తోపాటు అయోధ్య, ఉప్పుమడుగు, శ్రీరాంనగర్, సింగరావుపేట, ఆలూరు, కిష్టంపేట, కుర్మపల్లి, రాజనగర్, సారంగాపూర్ మండలంలోని నాగునూర్, లచ్చక్కపేట గ్రామాలతో మండలం చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో కొన్నాళ్లుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం కొత్త మండలం ఏర్పాటుకు ముందుకు రావడంతో స్థానిక ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే రెవెన్యూ అధికారులు అల్లీపూర్, ఉప్పుమడుగు, కిష్టంపేట, ఆలూరు, నాగునూర్, లచ్చక్కపేట రెవెన్యూ గ్రామాల్లోని రైతులు, జనాభా వివరాలు సేకరించారు. అల్లీపూర్ మండలకేంద్రంగా ఏర్పడితే ప్రభుత్వ భూముల విస్తీర్ణం, కార్యాలయాలకు అవసరమయ్యే స్థలాలు వంటి ప్రతిపాదనలు పంపించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

అల్లీపూర్‌లో అన్నీ అనుకూలమే..

అల్లీపూర్ మండలకేంద్రంగా ప్రకటించడానికి గ్రామంలో ప్రభుత్వ స్థలం ఉంది. మహాత్మజ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్, ఎస్సెస్సీ ఎగ్జామ్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్‌సెంటర్, పశువైద్య సబ్‌సెంటర్ ఉన్నాయి. కేడీసీసీ బ్యాంక్ కూడా ఉండడం అనుకూలమైన అంశాలు. పైగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తమ ఎన్నికల ప్రచారంలో కూడా తాము ఎమ్మెల్యేగా గెలిస్తే అల్లీపూర్‌ను మండలం చేస్తామని హామీ ఇచ్చారు. అనుకున్నట్లే వీరంతా మండలం ఏర్పాటుకు సానుకూలంగా ఉండడం.. సీఎం రేవంత్‌రెడ్డి కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అల్లీపూర్ ప్రజల దశాబ్దాల కల మరికొద్ది రోజుల్లోనే నెరవేరనుంది.

మండలం ఏర్పాటుకు సానుకూలం

అల్లీపూర్‌ను మండలంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సంజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గ్రామస్తులు వీరిని వేర్వేరుగా కలిసి మండలం ఏర్పాటు చేయాలని కోరారు. వారు త్వరలోనే ప్రకటన వస్తుందని చెప్పడంతో గ్రామస్తులు, జేఏసీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. మరోవైపు అల్లీపూర్‌ను మండలం చేయాలని జీవన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె నోటీసు



డీఈవో కార్యాలయంలో నోటీస్ అందిస్తున్న ఉద్యోగులు

జగిత్యాల: సమస్య పరిష్కారానికి కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు.. ఈనెల 27 నుంచి వందశాతం సమ్మెలో పాల్గొంటామంటూ డీఈవో కార్యాలయంలో నోటీసు అందించారు. తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్నామని, నవంబర్ 19న నోటీసు ఇచ్చినా ప్రభుత్వం నుంచి సమాధానం రాలేదని, దీంతో ఈనెల 10 నుంచి ఆందోళనలు చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతలను దృష్టిలో ఉంచుకుని శాంతియుతంగా ఆందోళనలో పాల్గొంటున్నామని, తమ స్థానంలో ఉపాధ్యాయులతో పాఠాలు బోధిస్తూ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. రాత్రివేళల్లోనూ విధులు నిర్వహించకుండా సమ్మెలో పాల్గొంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బర్ల నారాయణ, కొడుకుల రవీందర్, చిట్యాల రవీందర్, అంజయ్య పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. వీరి సమ్మెకు మంగళవారం వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

నేటి నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల



ఎస్సారెస్పీ



జిల్లాకు సాగు నీరు అందించే కాకతీయ కాలువ

- ఆన్, ఆఫ్ పద్ధతిలో సాగునీరు
- ఏప్రిల్ వరకు చివరి తడి

జగిత్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు ఈనెల 25 నుంచి సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఎల్ఎండీ ఎగువ ఆయకట్టుకు నీటి సరఫరాకు ప్రాజెక్టు అధికారులు ప్రణాళిక రూపొందించారు. నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలోని 4.50 లక్షల ఎకరాలకు ఆన్, ఆఫ్ పద్ధతిలో (వారం విడిచి వారం) విడుదల చేయనున్నారు. కాకతీయ కాలువ ద్వారా జోన్–1 ఆయకట్టు (డీ–5 నుంచి డీ–53 వరకు)కు వారం రోజులు, జోన్–2 ఆయకట్టు (డీ–54 నుంచి డీ–94 వరకు)కు వారం రోజులు సరఫరా చేయాలని నిర్ణయించారు. జోన్–2కు ఈనెల 25న జోన్–1కు జనవరి 2 నుంచి నీటిని విడుదల చేయనున్నారు. ఏప్రిల్ 8వ తేదీ వరకు పంటలకు సాగు నీరు అందించనున్నారు. కాకతీయ కాలువ ద్వారా మూడు నుంచి ఐదువేల క్యూసెక్కుల సామర్థ్యం ఉండేలా చూడనున్నారు. లక్ష్మీ ప్రధాన కాలువకు కూడా సాగు నీటిని విడుదల చేస్తున్నారు.

ఎస్సారెస్పీలో 80.053 టీఎంసీలు

ఎస్సారెస్పీలో ప్రస్తుతం నీటి నిల్వ 1090.90 అడుగులతో 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి తాగునీటి అవసరాలకు కోరుట్ల, జగిత్యాల పట్టణాలకు 61 క్యూసెక్కులు, ఆదిలాబాద్, నిర్మల్ పట్టణాలకు 63 క్యూసెక్కులు, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి పట్టణాలకు 107 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తున్నారు.

చివరి ఆయకట్టుకూ చేరేలా..

ఎస్సారెస్పీ నీరు కాలువ చివరి భూములకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. కాలువలపై లస్కర్లు, అధికారులు కాలువలను పరిశీలించనున్నారు. అలీసాగర్, గుత్పా వంటి ఎత్తిపోతల పథకాలకు కూడా వారబంధీ పద్ధతిలోనే నీటిని సరఫరా చేయనున్నారు. కాలువలకు గండ్లు పడితే వెంటనే మరమ్మతు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వంనుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

స్టేడియంలో మరమ్మతు చేయించండి

- కలెక్టర్ సత్యప్రసాద్



స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల: వివేకానంద స్టేడియంలో క్రీడాకారులకు అవసరమైన మరమ్మతు చేయించాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. 'పని మనుషుల్లా క్రీడాకారులు' శీర్షిక న 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. స్టేడియంను మంగళవారం తనిఖీ చేశారు. స్విమ్మింగ్‌పూల్ వాటర్‌ను టెండర్ ద్వారా శుభ్రపర్చేలా చూడాలని, ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను క్లీనింగ్ చేయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే స్టేడియంలో ఏయే వసతులు అవసరమో చూడాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో మధుసూదన్, కమిషనర్ చిరంజీవి, తహసీల్దార్ ఉన్నారు.

సాక్షి స్పందన

కేంద్ర హోంమంత్రి మాటలు బాధాకరం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌కుమార్, నాయకులు

జగిత్యాల: అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి మాటలు బాధాకరమని, ఆయన క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం పీసీసీ అధ్యక్షుడు ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఇందిరాగాంధీ చౌక్ నుంచి కొత్తబస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు చట్టం ప్రకారం నడుచుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎవరైనా శిక్షార్హులేనన్నారు. నేర ప్రవృత్తి కలిగిన అమిత్‌షాకు కేంద్ర హోంమంత్రి బాధ్యతలు అప్పగించడం సమంజసం కాదన్నారు. ఈ అంశం కేవలం కాంగ్రెస్ పార్టీకి సంబంధించినది కాదని, యావత్ భారత దేశానికి సంబంధించిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింగారావు, కృష్ణారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈ-సేవతో సేవలు సులభతరం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేజిస్ట్రేట్

మెట్‌పల్లి: ఈ–సేవ కేంద్రంతో సేవలు వేగంగా అందించడానికి అవకాశముంటుందని సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని కోర్టులో ఏర్పాటు చేసిన ఈ–సేవ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. పలు రకాల సేవలను ఆన్‌లైన్‌లో అందించడం ద్వారా న్యాయవాదులు, కక్షిదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ అరుణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, న్యాయవాదులు పాల్గొన్నారు.

కల్వకోటలో దొంగల బీభత్సం



సీసీ కెమెరాలో నమోదైన దొంగ ఆనవాళ్లు

మేడిపల్లి: మండలంలోని కల్వకోటలో దొంగలు సోమవారం అర్ధరాత్రి బీభత్సం సృష్టించారు. గ్రామానికి చెందిన గడ్డమీది రాకేష్ ఇంట్లో చొరబడి మూడు తులాల బంగారం, మూడు తులాల వెండి, రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారు. రాకేష్ కొడుకు పుట్టినరోజు సందర్భంగా బంధువుల ఇంటికి వెళ్లి అర్ధరాత్రి అక్కడే ఉన్నాడు. పొద్దున వచ్చేసరికి దొంగతనం జరిగింది. రాకేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు గ్రామానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అలాగే దుర్గమ్మ గుడిలో హుండీ పగలగొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

బైక్ కొనివ్వలేదని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

మెట్‌పల్లిరూరల్: బైక్ కొనివ్వలేదనే కారణంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మెట్‌పల్లి మండలం వేంపేటకు చెందిన మామిడాల రణధీర్ (22) హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో బీటెక్ చదుతున్నాడు. ఇటీవల ఓ ఫంక్షన్ నిమిత్తం ఇంటికి వచ్చిన కిరణ్ బైక్ కొనివ్వాలని ఇంట్లో తరచూ గొడవ చేస్తున్నాడు. తల్లిదండ్రులు కొనివ్వకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈనెల 22న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు కిరణ్‌ను మెట్‌పల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. రణధీర్ తండ్రి ప్రకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక డంప్ స్వాధీనం

కథలాపూర్: మండలంలోని బొమ్మెన శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన 117 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపులను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ వినోద్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇసుక నిల్వ ఉంచిన స్థలానికి వెళ్లామన్నారు. ఇందులో 87 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకకు వేలం వేశామని, రూ.87 వేలు చెల్లించి ఓ వ్యక్తి ఇసుక తీసుకెళ్లారని, మిగతా ఇసుకకు వేలం వేస్తామని పేర్కొన్నారు. ఆర్ఐ మద్దెల నాగేశ్, మురళి, వినోద్ ఉన్నారు.

చెత్త సేకరణపై చిత్తశుద్ధి ఏది..?

- పారిశుధ్య కార్మికులకు భద్రత కరువు
- ఇప్పటికీ అందించని గ్లౌస్‌లు, షూలు
- తడి, పొడి చెత్త సేకరణపై నిర్లక్ష్యం



చేతులకు గ్లౌజ్‌లు, కాళ్లకు షూలు లేకుండా చెత్త సేకరిస్తున్న కార్మికులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలో చెత్త సేకరణపై చిత్తశుద్ధి కరువైంది. ఇంటింటా తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలి. డ్రెయినేజీల వద్ద ప్లాస్టిక్, ఇతరత్ర వస్తువులను వేరుగా వేయాలి. కానీ, కార్మికులకు అధికారులు ఎలాంటి సూచనలు జారీ చేయకపోవడంతో ఇష్టానుసారంగా సేకరిస్తున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రం కావడంతో రోజూ 50 మెట్రిక్ టన్నులకు పైగా చెత్త సేకరణ జరుగుతోంది. కాగా ట్రాక్టర్ లేదా వ్యాన్లలో ముందుగా కవర్లు వేసి వాటిపై చెత్త పోయాలి. కానీ ఈ నిబంధనలు ఎక్కడా పాటించడం లేదు.

సగానికి పైగా రోడ్డుపైనే..

కార్మికులు ఇంటింటా తిరిగి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. కానీ ట్రాక్టర్లలో ఎలాంటి కవర్లు లేకుండానే మొత్తం కలిపేస్తున్నారు. అలాగే డ్రెయినేజీల వద్ద తీసే చెత్తను సైతం ట్రాక్టర్లలో తట్టలతో ఎత్తి పడేస్తున్నారు. ఈక్రమంలో ట్రాక్టర్లు, వ్యాన్లు పూర్తిగా నిండి డంపింగ్‌యార్డుకు వెళ్లే సమయంలో చెత్త రోడ్లపై పడిపోతోంది. తడి చెత్తతో ఎరువులు తయారుచేయాలని వర్మి కంపోస్ట్ ప్లాంట్ సైతం ఏర్పాటు చేశారు. బయోమైనింగ్ చేస్తున్నారు. చెత్త సేకరణలో మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారు.

వెదజల్లుతున్న దుర్గంధం

మున్సిపల్ వాహనాల్లో తీసుకెళ్లే చెత్త కాలనీల్లో రోడ్లపై పడిపోవడం, దానిని ఎవరూ తీయకపోవడంతో దారి వెంట వెళ్లే పాదచారులు, వాహనదారులు దుర్గంధంతో ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా శానిటేషన్ అధికారులు స్పందించి తడి, పొడి చెత్త వేరు చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

భద్రత ఎక్కడ?

కార్మికులకు ఏటా చేతులకు గ్లౌస్‌లు, కాళ్లకు షూస్ ఇవ్వాలి. కానీ ఏదో కొంత మందికి ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడం కార్మికులకు ఇబ్బందిగా మారింది. వారు చెత్త సేకరణ సమయంలో, డ్రెయినేజీల నుంచి సిల్ట్ తీసే క్రమంలో గాజు పెంకులు కోసుకుపోయి ప్రమాదాల బారినపడిన ఘటనలున్నాయి. అధికారులు, పాలకవర్గం స్పందించి కార్మికులకు గ్లౌస్‌లు, షూస్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటీవల కొంత మందికి ఇచ్చినా పూర్తిస్థాయిలో పరికరాలు అందలేదు.

చలికి గజగజ

వర్షకాలంలో కార్మికులకు రెయిన్‌కోట్లు ఇవ్వగా, ప్రస్తుతం చలికాలం నేపథ్యంలో స్వెటర్స్, రగ్గులు ఇవ్వడం లేదు. పట్టణం పరిశుభ్రంగా ఉండాలంటే కార్మికులే ఎంతో ముఖ్యం. కానీ వారి సంరక్షణకు చర్యలు నామమాత్రమే. చలి తీవ్రత ఉన్న నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి స్వెటర్లు అందించాలని కోరుతున్నారు.

కవర్లు అందిస్తాం



తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి. వాహనాల్లో కవర్లు వేసి చెత్త సేకరించేలా చూస్తాం. రోడ్లపై పడిపోకుండా జాగ్రత్తలు చేపట్టేలా కార్మికులను ఆదేశిస్తాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో చోటు సాధించేలా చర్యలు తీసుకుంటాం.

– చిరంజీవి, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

తిరోగమనంలో తెలంగాణ



ఓపెన్‌జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మల్లాపూర్ : కాంగ్రెస్ పాలన వైఫల్యంతో రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్లిందని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం పర్యటించిన ఆయన జెడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్‌లైట్లను ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి సారించకుండా బీఆర్ఎస్‌ను దూషించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన అందించి.. పల్లెలను దేశానికే ఆదర్శంగా నిలిపారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వంతో కొట్లాడుతానని స్పష్టం చేశారు. అనంతరం మండలకేంద్రంలో రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాజీ ఎంపీపీ కాటిపెల్లి సరోజన, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముద్దం శరత్‌గౌడ్, రైతుబంధు సమితి మాజీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, వేంపేట నర్సారెడ్డి, బద్దం అంజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): దుబ్బపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో రామగుండం ప్రాంతానికి చెందిన అప్సరుద్దీన్(31)మృతి చెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. అప్సరుద్దీన్ ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వెళ్తుండగా.. దుబ్బపల్లి వద్ద తొలుత కారు ఢీకొంది. దీంతో అతడు కింద పడగా వెనకాల కరీంనగర్ వైపుకే వెళ్తున్న లారీ అప్సరుద్దీన్‌పైకి ఎక్కింది. దీంత అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు.

రైలు కింద పడి యువకుడు..



పొనగంటి సునీల్(ఫైల్)

రామగుండం: అంతర్గాం మండలం పెద్దంపేట రైల్వేగేట్ వద్ద గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీకి చెందిన పొనగంటి సునీల్(33) సోమవారం అర్ధరాత్రి రైలు కింద పడి మృతిచెందాడు. ఈమేరకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారని జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి మంగళవారం తెలిపారు. మృతుడు అవివాహితుడు. అతడికి సోదరుడు రవికుమార్, సోదరి లావణ్య, బావ సురేందర్ ఉన్నారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతున్నామని తిరుపతి పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో ఒకరు..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాగట్లపల్లి శివారులోని మొండిచింత మూలమలుపు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

మల్యాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని బల్వంతాపూర్‌లో విషాదం నింపింది. బల్వంతాపూర్ గ్రామానికి చెందిన నాగుల మొండయ్య, నర్సవ్వ భార్యాభర్తలు. 20 రోజుల క్రితం ఇద్దరూ కలిసి కొండగట్టుకు వెళ్తున్నారు. ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. నర్సవ్వ (60) కోమాలోకి వెళ్లింది. కరీంనగర్ ఆస్పత్రిలో ఆమెకు చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. మంగళవారం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

27, 28న ఏఐటీయూసీ మహాసభలు



మాట్లాడుతున్న సుతారి రాములు

కోరుట్ల: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 27న జగిత్యాలలో.. 28న హైదరాబాద్‌లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికులతో సమావేశమయ్యారు. కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.ఉస్మాన్ తెలిపారు. కాంట్రాక్టు కార్మికులందనీ పర్మినెంట్ చేయాలన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ రాష్ట్ర మహాసభలను ఈనెల 28న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్ఎం.రాధ పాల్గొన్నారు.

నూతన నియామకం..

ఏఐటీయూసీ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిట్యాల నవీన్, ప్రధాన కార్యదర్శిగా రాగుట్ల సాయికుమార్, కోశాధికారిగా ఎర్ర రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు, ఉప కార్యదర్శిగా చిట్యాల రాజనర్సయ్య, మోతె చంద్రప్రకాశ్ ఎన్నికయ్యారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నర్సయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న లింగవ్వ

రాయికల్: చెట్ల కొమ్మలు క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి రైతు దుర్మరణం పాలైన ఘటన మండలంలోని అల్లీపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై సుధీర్‌రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్లపల్లి నర్సయ్య (56)కు రెండెకరాల పొలం ఉంది. కొద్ది దూరంలో విద్యుత్ స్తంభం ఉండడంతో మోటార్ కనెక్షన్ కోసం వైరును చెట్ల కొమ్మలతోపాటు అక్కడక్కడ కర్రలు పాతుకున్నాడు. వైరు వెళ్తున్న ప్రాంతమంతా చిత్తడిగా మారడంతో తొలగించేందుకు మంగళవారం పొలానికి వెళ్లాడు. పొదలను తొలగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వైర్‌కు తగిలి షాక్‌కు గురై అక్కడిక్కడే చనిపోయాడు. నర్సయ్యకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. నర్సయ్య భార్య లింగవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చైన్ స్నాచర్‌ను పోలీసులకు అప్పగింత



ధర్మపురి: చైన్ స్నాచర్‌ను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన ధర్మపురిలో చోటు చేసుకొంది. పట్టణంలో మంగళవారం రాత్రి ఓ మహిళ సామగ్రి కొనుగోలు చేసుకుని ఇంటికి వెళ్తుండగా.. ఆమె మెడలో నుంచి బంగారు చైన్‌ను లాక్కెళ్లే ప్రయత్నం చేశాడు. పారిపోతుండగా అక్కడే ఉన్న కొందరు యువకులు అతడిని వెంబడించి పట్టుకొని హెడ్ కానిస్టేబుల్ శంకర్‌కు అప్పగించారు. ఆయన నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

వాగులో పడి మహిళ దుర్మరణం

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన మామిడి రాజేశ్వరి(55) మూడు రోజుల క్రితం ప్రమాదవశాత్తు మానేరు వాగులో పడి గల్లంతు కాగా, మంగళవారం మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాలు.. రాజేశ్వరి కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేక ఇబ్బంది పడుతుంది. ఈ క్రమంలో ఇంట్లో నుంచి వెళ్లి వాగులో ప్రమాదవశాత్తు పడి నీట మునిగింది. మృతురాలి తల్లి కనుకమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

కరీంనగర్ అర్బన్: వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువును మరోమారు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని ఐఅండ్‌పీఆర్ ఏడీ లక్ష్మణ్ తెలిపారు. ఈ నెల 31 తేదీతో కార్డుల గడువు ముగియనున్నందున పలు కారణాలతో మరో 3 నెలల పాటు గడువు పెంచిందని వివరించారు. జనవరి 1, 2025 నుంచి మార్చి 31, 2025 అక్రిడిటేషన్ కార్డులను వినియోగించవచ్చని పేర్కొన్నారు.

పలు పరీక్షలు వాయిదా

కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని పీజీ, ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీసెట్, యూజీ సెట్ ఉన్నందున పరీక్షలు వాయిదా వేశామని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరు మాల్‌ప్రాక్టీస్ కేసులు

వర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఆరు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి తెలిపారు.

6నుంచి ఎల్ఎల్‌బీ సెమిస్టర్స్

శాతవాహన యూనివర్సిటీ పరిధిలో 2025 జనవరి 6వ తేదీ నుంచి ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణ అధికారి తెలిపారు. 1వ పేపర్ 6వ తేదీన, 2వ పేపర్ 8వ తేదీన, 3వ పేపర్ 10న, 4వ పేపర్ 17న, 5వ పేపర్ 20వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ముదురుతున్న ఆలయ వివాదం



వెల్లులలోని ఎల్లమ్మ ఆలయం ముందు పోలీస్ బందోస్తు

- దేవాదాయశాఖ పరిధిలోకి వెల్లుల ఎల్లమ్మ తల్లి ఆలయం
- వద్దంటూ వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు
- ప్రతి మంగళవారం ఆలయం వద్ద ఉద్రిక్తత
- భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల ఎల్లమ్మ తల్లి ఆలయ వివాదం మరింత ముదురుతోంది. ఆలయాన్ని దేవాదాయశాఖ పరిధిలోకి విలీనం చేయడంపై గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎప్పటిలాగే వీడీసీ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు సోమవారం అర్ధరాత్రి ఆలయం వద్ద 'భక్తులకు ఎలాంటి దర్శన టికెట్ తీసుకోబడదు..' అంటూ గ్రామస్తులు ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. దేవాదాయశాఖ ఉత్తర్వులతో ఆలయానికి వస్తున్న ఆ శాఖ అధికారులను ఇప్పటికీ పలుమార్లు అడ్డుకున్న వీడీసీ, గ్రామస్తులు మంగళవారం మరోమారు అడ్డుకున్నారు. దీంతో ఆలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది.

విలీనం జరిగిందిలా..

సుమారు 40 ఏళ్లుగా వీడీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని ఇటీవల దేవదాయ శాఖలో విలీనం చేశారు. ఇక్కడికి ప్రతి మంగళవారం చుట్టుపక్క గ్రామాలనుంచి, ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. మేక, కోడిమొక్కు, ఇతరత్రా వాటికి వీడీసీ డబ్బులు వసూలు చేస్తోంది. ఆలయానికి హుండీ ద్వారా ఆదాయం సమకూరుతోంది. అయితే భక్తులు ఎల్లమ్మకు సమర్పించే కానుకలు పక్కదారి పడుతుండడం, వచ్చే ఆదాయంలో అక్రమాలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. దాని ఆధారంగా ఆలయాన్ని దేవాదాయదాయ శాఖలో విలీనం చేశారు.

మంత్రి వద్దకు వివాదం..

ఆలయాన్ని దేవాదాయశాఖలో విలీనం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు.. ఆలయానికి వచ్చిన అధికారులను పలుమార్లు అడ్డుకున్నారు. దీంతో ప్రతి మంగళవారం ఆలయం వద్ద ఉద్రికత్త చోటుచేసుకుంటోంది. ఈ క్రమంలో తమకు 15 రోజుల పాటు సమయమివ్వాలని గ్రామస్తులు అధికారులను కోరారు. వారి విన్నపాన్ని పరిగణనలోనికి తీసుకున్న అధికారులు గత మంగళవారం నుంచి వారంపాటు సమయం ఇస్తున్నామని ప్రకటించారు. ఆ తర్వాత ఆధీనంలోకి తీసుకుంటామని తెల్చిచెప్పారు. ఈ మేరకు ఆలయాన్ని దేవాదాయశాఖ నుంచి తప్పించాలని ప్రయత్నాలు ప్రారంభించిన గ్రామస్తులు ఈనెల 19న ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో కలిశారు. ఆయనకు సమస్యను విన్నవించగా.. దేవాదాయశాఖ కమిషనర్‌తో మాట్లాడినట్లు తెలిసింది. మరోవైపు దేవాదాయశాఖలో విలీనం అయిన ఆలయాన్ని ఎందుకు ఆధీనంలోకి తీసుకోవడంలేదంటూ ఓ వ్యక్తి న్యాయవాది ద్వారా దేవాదాయ శాఖ అధికారులకు నోటీసులు పంపించినట్లు సమాచారం.

దేవాదాయ శాఖ అధికారుల ఆధీనంలోకి ఆలయం

వివాదం ఎటూ తేలకపోవడంతో మంగళవారం ఆలయం వద్ద పోలీసులు ముందస్తుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న గ్రామస్తులతో దేవాదాయశాఖ అధికారులు, పోలీసులు చర్చలు జరిపారు. కొద్దిసేపు వీడీసీ సభ్యులు, అధికారులకు వాగ్వాదం చోటుచేసుకుంది. మరోవారం పాటు సమయం ఇవ్వాలని గ్రామస్తులు కోరగా దేవాదాయశాఖ ఉన్నతాధికారులు నిరాకరించారు. చివరకు పోలీస్ బందోబస్తు మధ్య దేవాదాయశాఖ అధికారులు ఆలయాన్ని ఆధీనంలోకి తీసుకుని నిర్వహణ కొనసాగిస్తున్నారు. గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావును కలిసి సమస్యను వివరించారు. ఆయన రెండురోజుల పాటు సమయమివ్వాలని చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ పరిశీలకులు, జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, ఈవో కాంతారెడ్డి, కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, ఎస్సైలు కిరణ్‌కుమార్, అనిల్, రాజు, నవీన్, శ్యాంరాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి రూ.26 వేల ఆదాయం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం రూ.26,150 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కాంతరెడ్డి తెలిపారు. ఆలయాన్ని దేవదాయశాఖ ఆధీనంలోకి తీసుకున్న మొదటిరోజు వివిధ సేవా టికెట్ల ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.

ప్రైవేటు రంగంలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

జగిత్యాల: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 28న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ తెలిపారు. మెడిప్లస్ కంపెనీలో 40 ఫార్మసిస్టులు, 100 జూనియర్ అసిస్టెంట్లు, 30 ఆడిట్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయని, ఆసక్తి గల వారు ఈనెల 28న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో నిర్వహించే జాబ్‌మేళాకు పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

సాగునీటి కోసం రైతు ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు



పురుగు మందు డబ్బాతో రైతు

మంథని: సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో నీళ్ల అందక పంటలు నష్టపోతున్న తమకు న్యాయం చేయాలని పెద్దపల్లి జిల్లా మంథని మండలం పోతారం గ్రామానికి చెందిన రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఎస్సారెస్పీ కాలువ పరిధిలోని ఎల్–6 కాలువను ఆక్రమించి పోతారంలో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మించారని, దీనిద్వారా పంటలకు సాగునీరు రావడం లేదని ఆవేదన చెందారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల ఎదుట తమగోడు వెళ్లబోసుకున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. దీంతో తాము హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. తమకు న్యాయం చేయాలని, కాలువను పునరుద్ధరించాలని కోర్టు ఉత్తర్వులు జారీచేసిందని వారు గుర్తుచేశారు. అయినా, సోలార్ పవర్ ప్లాంట్ కంపెనీ నిర్వాహకులు కోర్టు ఆదేశాలు పట్టించుకోవడం లేదని ఆరోఇంచారు. తద్వారా సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న క్రమంలో ఓ యువ రైతు పురుగుల మందు డబ్బా పట్టుకొని మందు తాగేందుకు యత్నించాడు. అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు రైతును అడ్డుకొన్నారు. ఆ తర్వాత ఆయనను అదుపులోకి తీసుకుని సర్దిచెప్పడంతో శాంతించాడు. ఈ విషయంపై నీటిపారుదల శాఖ అధికారులతో పోలీసులు ఫోన్‌తో మాట్లాడారు. హైకోర్టు తీర్పు ఆధారంగా కాలువను 20 రోజుల్లో పునరుద్ధరిస్తామని ప్లాంట్ సైట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.



పవర్ ప్లాంట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

వేధింపులపై ముగిసిన విచారణ!

- సీల్డ్ కవర్‌లో నివేదిక పంపిన ప్రత్యేక కమిటీ సభ్యులు

కరీంనగర్: తాను చదివే కాలేజీకి చెందిన ఉద్యోగి తనను లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఓ విద్యార్థిని జాతీయ మహిళా కమిషన్, ఎస్సీ,ఎస్టీ కమిషన్, శాతవాహన వర్సిటీ అధికారులకు చేసిన ఫిర్యాదుపై విచారణ ముగిసింది. వివిధ కమిషన్లు, యూనివర్సిటీ ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదుల మేరకు అంతర్గతంగా పలువురు ప్రొఫెసర్లతో అంతర్గత విచారణ కమిటీని ఇటీవల యూనివర్సిటీ నియమించింది. ఈ కేసు జిల్లాలో సంచలనం కావడం, పోలీసు కేసు కూడా నమోదవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిటీ విచారణ పూర్తవడం ఆసక్తి రేపుతోంది. ఇటీవల ఫిర్యాదు చేసిన మహిళా విద్యార్థినిని కమిటీ సభ్యులు పలుమార్లు విచారించారు. అదే సమయంలో కమిటీ సభ్యులు సదరు కాలేజీలో పర్యటించి, సిబ్బందిని, తోటి విద్యార్థులను విచారించినట్లు తెలిసింది. విచారణలో తాము సేకరించిన వివరాల ఆధారంగా రూపొందించిన నివేదికను సీల్డ్ కవర్‌లో ఉన్నతాధికారులకు పంపించారు.

కక్ష సాధింపు చర్యనా?

ఫిర్యాదు చేసిన విద్యార్థిని వెనక ఎవరు ఉన్నారన్నది ఇప్పుడు చర్చానీయాంశంగా మారింది. అదే కళాశాలకు చెందిన ఓ సీనియర్ ఉద్యోగి సదరు విద్యార్థినిని ఈ వ్యవహారంలో తప్పుదోవ పట్టించినట్లు ప్రచారం జరుగుతోంది. కేవలం తాను కక్ష సాధించే క్రమంలో ఈ వ్యవహారంలో కలగజేసుకుని, జాతీయస్థాయికి పెంచి విషయాన్ని భూతద్దంలో చూపినట్లు సమాచారం. అదే సమయంలో ఇది రెండు కాలేజీల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరా? లేక ఇద్దరు వ్యక్తుల మధ్య జరుగుతున్న కక్ష సాధింపు చర్యనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విచారణ కమిటీ వచ్చిన సమయంలో ఆ తరగతిలోని మిగిలిన విద్యార్థులంతా కూడా కమిటీకి తమ తమ నివేదికలను లిఖిత పూర్వకంగా ఇచ్చారని తెలిసింది. అందులో వారు ఏం రాశారు? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇదంతా ఇటీవలే ప్రభుత్వ ఉద్యోగానికి ఎన్నికైన వ్యక్తికి ఎలాగైనా ఆ ఉద్యోగం రానీయకుండా కొందరు పన్నిన కుట్రగా కళాశాల సిబ్బంది అభివర్ణిస్తున్నారు.